కాడెడ్లు @ 2లక్షలు

- ఆకాశాన్నంటిన ధర
- యంత్రాలు, కూలీల డిమాండ్ దృష్ట్యా మొగ్గు
- జోరుగా మాల్ పశువుల సంత


కాడెడ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతు

యాచారం: పశువుల సంతలో కాడెద్దుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. భూగర్భజలాలు పుష్కలంగా ఉండడం, వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న దశలో అన్నదాతలు మళ్లీ కాడెద్దులు కొనుగోలుపై దృష్టి పెట్టారు. రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దులోని యాచారం మండల పరిధిలో మాల్‌గ్రామంలో ప్రతీ వారం పశువుల సంత జరుగుతుంది. ఈ సంతకు రంగారెడ్డి జిల్లాలోని యాచారం, మంచాల, మాడ్గుల్, ఆమన్‌గల్, కడ్తాల్, నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ, దేవరకొండ తదితర మండలాల నుంచి రైతులు ఇక్కడికి వస్తారు. సంత జరిగే రోజున పశువుల క్రయ, విక్రయాలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరందుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మరో రెండు, మూడేళ్ల పాటు భూగర్భజలాలకు ఢోకా లేదనే భరోసా రైతుల్లో నెలకొంది. వ్యవసాయ పనులకు శాశ్వతంగా ఉపయోగపడే అరక దున్నె కాడెద్దుల కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

అరకదున్నే ఎద్దులకు డిమాండ్..

మాల్ పశువుల సంతలో ఒక్కో కాడెద్దుల జత రూ. లక్షన్నర నుంచి రూ. 2 లక్షలకు పైగానే ధర పలికింది. అరక దున్నె ఎద్దులకు రూ.50 వేల నుంచి రూ. లక్షన్నర వరకు డిమాండ్ ఏర్పడింది.

పదేళ్ల వయస్సున్న కోడెల జత రూ. రెండున్నర లక్షలు దాటింది. కాడెద్దుల జతలతో పాటు పాడి పశువుల ధరలు, పాడి గేదెల ధరలు కూడా భగ్గుమన్నాయి. 15 లీటర్ల పాలిచ్చే పాడి పశువులు రూ. లక్షన్నరకు పైగా రేట్లు ఉన్నాయి. పాల ధరలు అమాంతం పెరగడం, పశుగ్రాసానికి ఇబ్బంది లేకపోవడంతో రైతులు మళ్లీ పాల ఉత్పత్తిపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో కొందరు రైతులు రెండేళ్ల లోపు వయసున్న పాడి పశువులు, గేదెలను రూ.30 వేలకు కొనుగోలు చేశారు. పాల ఉత్పత్తి కోసం తక్కువ వయసున్న పశువులను కొనుగోలు చేస్తున్నారు. వాటిని రెండు, మూడేళ్ల పాటు సాకితే మంచి ఆదాయం వస్తుందనే ఆలోచనతో వాటి కొనుగోలుకు అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు.

పెరిగిన యంత్రాల, కూలీ ధరలు..

డిజిల్ ధరలు అమాంతం పెరగడం, ట్రాక్టర్ దున్న డానికి ధరలు బాగా పెరిగాయి. గంటసేపు పొలానికి రూ. వెయ్యి నుంచి రూ.1,500 వరకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న దృష్ట్యా ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. కాడెద్దులు లేని రైతులు ట్రాక్టర్లతోనే కరిగట్టు దున్ని వరి నాట్లేస్తున్నారు. ఎకరా పొలాన్ని దున్ని నాటేస్తే రూ. 20 వేలకు పైగానే ఖర్చు అవుతుంది. పది ఎకరాలున్న రైతులకు రూ. రెండు లక్షలకు పైగానే ఖర్చు అవుతుంది. వరి, కూరగాయలు సాగు చేసే రైతులకు కూలీ ఖర్చులే భారంగా మారాయి. దీంతో శాశ్వతంగా రెండు, మూడేళ్ల పాటు వ్యవసాయం చేసుకోవడానికి మళ్లీ కాడెద్దుల కొనుగోలపై దృష్టి పెట్టారు.

జత రూ. 92 వేలకు అమ్మాను..



మంగళవారం జరిగిన మాల్ పశువుల సంతలో జత ఎద్దులను రూ.92 వేలకు అమ్మాను. పశువుల ధరలు బాగా పెరిగాయి. కాడెద్దుల కొనుగోలుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మూడు వారాల కింద వస్తే రూ. 50 వేలకే అడిగారు.

– నాగయ్య, వట్టిపల్లి, మర్రిగూడ మండలం

కాడెద్దులతో వ్యవసాయం మేలు..



మాల్ పశువుల సంతలో రెండు వారాలుగా కాడెద్దుల ధరలు భగ్గుమంటున్నాయి. కాడెద్దుల కొనుగోలుకు సంతకు వస్తే రూ. 2 లక్షల వరకు డిమాండ్ ఉంది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో కాడెద్దులతోనే వ్యవసాయం మేలని అనిపిస్తుంది. 20 ఎకరాల్లో పత్తి, వరి పంట సాగుచేస్తున్నాను. – కలకొండ బీరప్ప, నక్కర్తమేడిపల్లి, యాచారం మండలం

క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: శోభానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు చోట్ల విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శోభానగర్, ఏవినగర్, వింటేజ్ హోమ్స్, యంజాల్ పాత ఊరు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మన్నెగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా మన్నెగూడ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

మండలం ప్రకటించేంతవరకు దీక్షలు


దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్, చంద్రయ్య, పాండు, కృష్ణయ్య, అనంతరాములు, చెన్నయ్య, పవన్ వాల్మీకి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

సర్పంచ్ ఉదయశ్రీ


మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఉదయశ్రీ

యాచారం: గ్రామంలోని పేదలకు అండగా ఉంటానని నందివనపర్తి సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం జెనిగ రాములు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ఏ పేదవాడు కష్టాల్లో పడకుండా ఉండేందుకు తన వంతు సాయం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామదాసు, మహేందర్, శ్రీశైలం, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి తోడ్పాటు


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్: మహిళలు స్త్రీనిధి బ్యాంకు లింకేజీల నుంచి రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మండల అధ్యక్షురాలు జంగమ్మ ఆధ్వర్యంలో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు ఉపయోగపడేవిధంగా వివిధ రకాల వస్తువులను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా కోశాధికారి వసంత, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఏపీఎం రాజేశ్వరి, డీఎం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పీసీసీ సభ్యులు మర్రి నిరంజన్‌రెడ్డి


మొక్కలు నాటుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని టీపీసీసీ సభ్యులు, ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ క్యాంపస్‌లో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ సరిత, సతీశ్, బీఆర్ఎస్ నాయకులు కోరే జంగయ్య, మాజీ సర్పంచ్ రాజు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఆమనగల్లు: పట్టణంలోని 11 కేవీ లైన్‌లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీతారాములు ఒక ప్రకటనలో తెలిపారు.

పోడు సమస్యను పరిష్కరించండి

పల్లెచెలక గిరిజనులు ఎమ్మెల్సీకి వినతి


కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన గిరిజనులు

కడ్తాల్: పోడు భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని పల్లె చెలక గిరిజనులు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 300 కుటుంబాలకు చెందిన తాము మూడు తరాలుగా 1100 వందల ఎకరాల మాసుర భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. కానీ అటవీ శాఖ అధికారులు సాగు చేయనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమెల్సీ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పోడు భూములపై హక్కులు కల్పిస్తున్న నేపథ్యంలో తమను కూడా గుర్తించి పోడు భూములపై హక్కులు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మోత్యానాయక్, సర్పంచ్ లోకేశ్‌నాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్, సీతారాం, శ్రీను, మధు, భీమ్లానాయక్ పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి

కాంగ్రెస్ నాయకులు రాఘువేందర్‌రెడ్డి


దొడ్లపహాడ్‌లో పర్యటిస్తున్న రాఘువేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం దొడ్లపహాడ్ గ్రామంలో శుక్రవారం సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని వివిధ దేవాలయాల్లో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మగుడి, కాటమయ్య దేవాలయం, వీరనాగమ్మ దేవాలయ నిర్మాణాలకు ఆర్థికసాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న గౌని దస్రమ్మ సర్జరీకి అవసరమైన ఆర్థికసాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ నిరంజన్, నిరంజన్‌గౌడ్, జంగయ్య, శ్రీనివాసులు, పెద్దయ్య, అంజయ్య, యాదయ్య, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మక్తమాదారంలో సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న బాల్‌రాజు

కడ్తాల్: రైతు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. మక్తమాదారం గ్రామంలో ముదిరాజ్ యువజన సంఘం అధ్యక్షుడు నర్సింహా ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నర్సింహా ముదిరాజ్ ఆధ్వర్యంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా బాల్‌రాజ్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాట నర్సింహా, రమేశ్, శివకుమార్, శివ, రాఘవేందర్, మల్లేశ్, బన్ని ముదిరాజ్ ఉన్నారు.

కేసీఆర్ కృషితో తొలగిన అడ్డంకులు

- సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట
- ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి


కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: సీఎం కేసీఆర్ కృషితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులకు అడ్డంకులు తొలగిపోయాయని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శేరిగూడలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే నియోజకవర్గంలో సాగునీటి అవసరాలు తీరిపోయాయయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు హైకోర్టు నోటీసులు


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

యాచారం: క్వారీ పనులను అడ్డుకున్న రైతులకు హైకోర్టు నోటీసులు పంపించింది. మొండిగౌరెల్లి గ్రామంలో సర్వే నంబరు 19లో కేఎస్ఆర్, మినరల్స్ అనే సంస్థ స్టోన్‌క్రషర్, క్వారీ పనులకు అనుమతులు తెచ్చుకోగా.. క్వారీ పనులను రైతులు అడ్డుకున్నారు. దీంతో సంస్థ యజమాని రమేశ్‌బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ద్వారా సదరు రైతులు తాండ్ర రమేశ్, నక్క యాదగిరి, గుర్రం చెన్నారెడ్డి, గుడాల వెంకటేశ్, మరిపల్లి సోమశేఖర్, ఎలిమినేటి శ్రీనువాస్‌రెడ్డి, రామ్‌రెడ్డికి శుక్రవారం నోటీసులు పంపించారు.

ఆమనగల్లు ఏడీఏగా సుజాత


సుజాత

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ శాఖ డివిజన్ కార్యాలయ ఏడీఏగా సుజాత శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో ఇటీవల ప్రభుత్వం నూతన వ్యవసాయ కార్యాలయం మంజూరు చేసింది. దీని పరిధిలోకి ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆమనగల్లు పట్టణంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలోనే ఏడీఏ కార్యాలయం ఏర్పాటు చేశారు. మహేశ్వరంలో ఏడీఏగా పనిచేస్తున్న సుజాతకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆమనగల్లు ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు.

నేడు సామూహిక రుద్రాభిషేకం

ఇబ్రహీంపట్నం: సామూహిక శతరుద్రాభిషేక మహోత్సవాన్ని శనివారం హయత్‌నగర్ ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు వీరశైవ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు జీఎం విశ్వేశ్వరయ్య, అధ్యక్షులు వీరయ్య, ఉపాధ్యక్షులు ఎం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం నందీశ్వర్‌లు తెలిపారు. అత్యంత ప్రాచీనమైన వీరశైవ ధర్మాచారాల ప్రకారం సామూహిక ఇష్టలింగార్చన, 108 మంది దంపతులతో సామూహిక పార్థివ లింగాలకు శత రుద్రాభిషేకం, వీరభద్ర ఖడ్గమాల-వివాహవిధి పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి షోలాపూర్ బార్సి మఠం గురుసిద్ధ మణికంఠ శివాచార్య మహాస్వాములు, దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహంత్ సిద్ధేశ్వర మహాస్వాములు, అలంపల్లి కంపెనీమఠంకు చెందిన చెన్న బసవ ప్రభు మహాస్వాములు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, కార్పొరేటర్ క్లెం నవజీవన్‌రెడ్డి, వీరశైవ జంగమ సమాజం అధ్యక్షుడు రుమాళ్ల విశ్వేశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి మఠం శివకుమార్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు.

వార్డు అభివృద్ధికి చర్యలు


పనులు ప్రారంభిస్తున్న జయరాంనాయక్

ఆమనగల్లు: పట్టణంలోని 9వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ సోన జయరాంనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ వార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటునట్లు చెప్పారు. వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత కాల్వలు నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుత్తి బాలస్వామి, రూపం వెంకటరెడ్డి, శంకర్, సాయిబాబా, జగదీశ్వర్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

కడ్తాల్: కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి, యాట నర్సింహా ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, మండ్లీరాములు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, మానయ్య పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తుల వెల్లువ


ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో కిక్కిరిసిన జనం


జనంతో కిటకిట లాడుతున్న మంచాల మండల కార్యాలయం

నేటితో ముగియనున్న గడువు

ఇబ్రహీంపట్నం: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద జనాలు పడిగాపులు గాస్తున్నారు. ఎన్నికల విధుల నిర్వహణ దృష్ట్యా రెండు రోజుల పాటు తహసీల్దార్ చంద్రకళ అందుబాటులో లేరు. శుక్రవారం పెద్ద సంఖ్యలో ఆయా సర్టిఫికేట్ల కోసం జనాలు ఎగబడ్డారు. సాయంత్రం 6:30 దాటినా సర్టిఫికేట్ల కోసం తహసీల్దార్ కార్యాలయంలో జనం నిరీక్షించారు. వీఆర్ఏలు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఆయా ధ్రువపత్రాలను కనీస విచారణ చేయకుండానే జారీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 2వేలకు పైగా కుల, ఆదాయ సర్టిఫికేట్లను అధికారులు జారిచేశారు. ముందుగానే ఊహించినట్లుగా భారీ సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని 14 గ్రామాల నుంచి గురు, శుక్రవారల్లో 707, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నుంచి 275 వచ్చాయి.

నేటితో ముగియనున్న గడువు

గృహలక్ష్మి పథకానికి శనివారంతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియనుంది. కుల, ఆదాయ ధ్రువపత్రాలు చేతికి అందకపోవడంతో ఇంకా చాలా మంది దరఖాస్తులు చేసుకునేందుకు నిరీక్షిస్తున్నారు. చివరిరోజు ఎక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు వస్తాయనే అంచనాతో అధికారులున్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: గృహలక్ష్మి దరఖాస్తులకు లబ్ధిదారులనుంచి విశేష స్పందన వస్తుందని ఎంపీడీఓ శ్రీకాంత్ పేర్కొన్నారు. సొంత జాగా ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి, ఎంపికైన లబ్ధిదారులకు రూ. 3లక్షలు అందజేయనుంది. ప్రభుత్వం ఈ నెల 10నుంచి 13వ తేదీ లోగా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. ఈ సందర్భంగా 417 దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి స్వీకరించినట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు.

మంచాలలో..

మంచాల: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి శుక్రవారం 1,150 దరఖాస్తులు వచ్చాయి. మంచాల మండలంలో మొదటి రోజు 626 రాగా, రెండో రోజు రెట్టింపుస్థాయిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను ఎప్పటికప్పుడు నాలుగు కౌంటర్ల ద్వారా ఎంపీడీఓ శ్రీనివాస్ స్వీకరించారు. దరఖాస్తుదారుల సౌలభ్యం కోసం టెంటు ఏర్పాటు చేశారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న శ్రీశైలం

ఆమనగల్లు: దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించాలని జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు వస్పుల శ్రీశైలం డిమాండ్ చేశారు. మద్యం దుకాణాలకు టెండర్లు వేయడానికి దాదాపు 15 రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం దీనికి 3రోజులే ఇస్తారా అని ఆయన ప్రశ్నించారు. పట్టణంలో శుక్రవారం శ్రీశైలం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఎన్నికల ముందు టీఆర్ఎస్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ఆయన చెప్పారు.

ఖబరస్థాన్‌ను రద్దు చేయాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఖానాపూర్ ప్రభుత్వ భూమిలో మంజూరైన ఖబరస్థాన్‌ను రద్దు చేయాలని ఎంపీటీసీ సరితాగణేష్‌గుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీలోని సబితాఇంద్రారెడ్డి స్వగృహంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ముస్లింలకు ఖబర్‌స్తాన్ నిర్మించాలని ఇటీవల ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, దాన్ని రద్దు చేసి ఆ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు నిమిత్తం ఆ భూమిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, నర్సింహా, శంకర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు


కడ్తాల్: విరాళం అందజేస్తున్న వర్తక వ్యాపారులు

కడ్తాల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హార్డ్‌వేర్, సిమెంట్, ప్లేవుడ్ దుకాణాల యజమానులు రూ.30వేలు, పాన్ బ్రోకర్లు రూ.40వేలు, ఎల్ఎస్ చికెన్ సెంటర్ నిర్వాహకుడు లక్ష్మయ్య రూ.5వేలు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను తగ్గించొచ్చన్నారు. వీటి ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్, గంట శ్రీనివాస్, రాజేందర్‌యాదవ్, పెంటారెడ్డి, లక్ష్మయ్య, ఓంప్రకాశ్, సురేశ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలతోనే మందుల వినియోగం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ధరణి కుమార్


మందుల కిట్‌ను అందజేస్తున్న ధరణికుమార్

తుర్కయంజాల్: వైద్యుల సూచనలతోనే మందులను వినియోగించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ధరణి కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర శుక్రవారం తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని ఇంజాపూర్‌లో హైపర్ టెన్షన్, డయాబెటిక్ కాంబినేషన్ డ్రగ్స్ వినియోగిస్తున్న రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. వారానికి ఒక సారి ఇళ్లలో నీరు నిల్వ ఉన్నచోట శుభ్రం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది హేమాలాల్, చంద్రశేఖర్, నరసింహా, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

యాచారం: గునుగల్, యాచారం, నల్లవెల్లి, చింతపట్ల, మాల్, కుర్మిద్ద, చింతుల్ల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తు పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం ఎస్టీయూటీఎస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రజుమంలో జిల్లా బాధ్యులు జగన్మోహన్‌రెడ్డి, మండల బాధ్యులు బాలక్రిష్ణ, శ్రీనువాస్, సాల్మన్‌రాజ్, లింగం, పాల్గొన్నారు.